


2022 ఆగస్టు 25వ తేదీన కుప్పంలో చంద్రబాబుతో పాటు ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తను లాఠీచార్జి చేసి గాయపరచిన పోలీసులు

- వైసీపీ హయాంలో ఇష్టానుసారంగా కేసులు పెట్టిన పోలీసులు
- ప్రభుత్వం వచ్చి ఏడు నెలలైనా స్పందన శూన్యం
- తాజాగా కుప్పంలో అక్రమ రౌడీ షీట్లను తొలగించాలని సీఎం ఆదేశం

రాజకీయ రౌడీషీట్ల నుంచి ఉపశమనమేదీ?





2023 ఆగస్టు 5న పుంగనూరులోకి చంద్రబాబు రాకుండా బారికేడ్లను ఏర్పాటుచేసి కాపలాగా ఉన్న పోలీసులు

వైసీపీ హయాంలో కొంతమంది పోలీసులు ఆ పార్టీ నాయకుల్లా పనిచేశారు. టీడీపీ శ్రేణుల మీద దాడిచేసి, మళ్లీ వారిపైనే అక్రమంగా హత్యాయత్నం కేసులు నమోదు చేసేవారు. ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబును కుప్పం, పుంగనూరులోకి రాకుండా అడ్డుకున్న ఘనత జిల్లా పోలీసులకే దక్కింది. జిల్లా మొత్తం అటుంచితే.. కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల టీడీపీ శ్రేణులు అక్రమ కేసులతో అల్లాడారు. జైళ్లకు వెళ్లారు. ఇప్పటికీ ఆ కేసులతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తయినా.. అక్రమ కేసులు, రౌడీ షీట్ల అంశాన్ని జిల్లా పోలీసు అధికారులు పునఃపరిశీలించడం లేదు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు పలుమార్లు అక్రమ రౌడీ షీట్లను తొలగించాలని పోలీసు ఉన్నతాధికారుల్ని కోరారు. ఏమాత్రం స్పందన లేకపోవడంతో అక్రమ కేసుల్ని, రౌడీషీట్లను తొలగించుకునేందుకు హైకోర్టును ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతున్నట్లు ఆయన ఆంధ్రజ్యోతితో చెప్పారు. ఇదిలా ఉండగా.. ఇటీవల కుప్పంలో పర్యటించిన సీఎం చంద్రబాబు అక్రమ రౌడీషీట్లను ఇంకా ఎందుకు తొలగించలేదని ఎస్పీ మణికంఠను ప్రశ్నించారు. నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పగా.. 'వైసీపీ హయాంలో తెరచిన రౌడీషీట్లన్నీ అక్రమమే. నిబంధనలతోపాటు మానవత్వం కోణంతో కూడా ఆలోచించి తొలగించాలి' అని సీఎం సూచించినట్లు సమాచారం.

ఘటన ఒకటి.. హత్యాయత్నం కేసులు 502.. రౌడీషీట్లు వంద

'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' కార్యక్రమంలో భాగంగా పుంగనూరుకు వస్తున్న చంద్రబాబును 2023 ఆగస్టు 5వ తేదీన పుంగనూరులో పోలీసులు అడ్డుకునే యత్నం చేశారు. బారికేడ్లను అడ్డుగా పెట్టి టీడీపీ శ్రేణులపై లాఠీచార్జి చేశారు. దీంతో టీడీపీ శ్రేణులు కూడా పోలీసుల మీద తిరగబడ్డారు. ఈ ఒక్క సంఘటనను ఆధారం చేసుకుని నియోజకవర్గంలో యాక్టివ్‌గా ఉండే టీడీపీ నాయకులు, కార్యకర్తలు 502 మంది మీద హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. 270/2023, 271, 272, 273, 274, 278, 279 ఎఫ్ఐఆర్ నెంబర్లతో ఏకంగా ఏడు కేసులు పెట్టారు. ప్రతి కేసులోనూ చల్లా బాబును ఏ1గా చూపించారు. ఈ క్రమంలోనే సుమారు వంద మందిపై అక్రమంగా రౌడీ షీట్లను తెరిచారు. దీంతోపాటు ఐదేళ్లలో వేర్వేరు ఘటనల్లో నియోజకవర్గానికి చెందిన మరో వంద మందిపై హత్యాయత్నం కేసులు పెట్టారు. దీంతో మొత్తం 600 హత్యాయత్నం కేసులు, వంద రౌడీషీట్లను అక్రమంగా నమోదు చేశారు. వీటి గురించి జిల్లాలో పట్టించుకునే నాథుడే లేడు.

పోలీసులే కొట్టి.. వాళ్లే హత్యాయత్నం కేసులు పెట్టేవారు

అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబును సొంత నియోజకవర్గంలో పర్యటించకుండా జీవో1 పేరుతో ప్రభుత్వం అడ్డుకున్న విషయం తెలిసిందే. 2023 జనవరి 4న చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు శాంతిపురం మండలం గొల్లపల్లె క్రాస్ వద్దకు టీడీపీ శ్రేణులు వెళ్లగా.. పోలీసులు వారిని అడ్డుకోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. అక్కడున్న సీఐ, ఎస్ఐలు మహిళలని కూడా చూడకుండా విచక్షణారహితంగా లాఠీచార్జి చేశారు. సుమారు పది మందికి గాయాలవ్వగా, నలుగురు ఆస్పత్రిలో చికిత్స పొందారు. 'నన్ను చంపాలనే ఉద్దేశంతో టీడీపీ జెండా కర్రలతో పొడిచేందుకు యత్నించారు.' అని అప్పటి పలమనేరు గ్రామీణ సీఐ అశోక్‌కుమార్ చేసిన ఫిర్యాదు ఆధారంగా 15మంది మీద హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. వారిలో మహిళలూ ఉన్నారు. వాస్తవానికి ఇక్కడ పోలీసులు.. టీడీపీ శ్రేణుల మీద విచక్షణారహితంగా లాఠీచార్జి చేసిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున వైరల్ అయ్యాయి.

- 2022 ఆగస్టు 24న రామకుప్పం మండలం కొల్లుపల్లె, కొంగనపల్లెలో చంద్రబాబు పర్యటన సందర్భంగా టీడీపీ వర్గీయుల రాళ్ల దాడిలో విధుల్లో ఉన్న తాను గాయపడ్డానంటూ అప్పటి రాళ్లబుదుగూరు ఎస్ఐ మునుస్వామి ఇచ్చిన ఫిర్యాదుతో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులుతోపాటు మరో ఆరుగురి మీద హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. అదే రోజు ఆరుగురు దాడి చేశారని వైసీపీ కార్యకర్త గణేష్, సురేష్‌రెడ్డిలు వేర్వేరుగా ఫిర్యాదు ఇవ్వడంతో మరో రెండు హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. అంటే.. అటు పోలీసులు, ఇటు వైసీపీ శ్రేణులు పోటీగా హత్యాయత్నం కేసులు నమోదు చేసిన విషయం స్పష్టంగా తెలుస్తోంది.
- 2022 ఆగస్టు 24, 25వ తేదీల్లో కుప్పం చంద్రబాబు పర్యటనలో వైసీపీ నాయకులే జెండాలు కట్టి రెచ్చగొట్టారు.కుప్పంలో అన్న క్యాంటీన్‌ను ధ్వంసం చేసి నిర్వాహకుడిని కొట్టారు.అయినా వారిపై కేసులు పెట్టని పోలీసులు..ఆ రెండ్రోజుల్లో ఏకంగా 72 మందిపై కేసులు పెట్టి 14 మందిని జైలుకు పంపించారు.

రౌడీ షీట్ తెరవాలంటే..

సాధారణంగా ఓ వ్యక్తి పదే పదే నేరాలకు పాల్పడితే, అతడిపై కనీసం మూడుకుపైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు అయి ఉంటే రౌడీషీట్‌ను తెరుస్తారు. కానీ, పుంగనూరు ఘటనలో మాత్రం ఎలాంటి నేర చరిత్ర లేని వంద మందిపై షీట్లను తెరిచారు.



ఇతని పేరు అంజాద్‌ఖాన్. రొంపిచెర్ల మండలం. టీడీపీ సానుభూతిపరుడైన ఇతను గొడవలకు ఆమడ దూరంలో ఉంటారు. ఇతనిపై గతంలో ఎలాంటి కేసులు లేవు. ముస్లింల జీవితాశయం ఉమ్రాకు వెళ్లాలని ఆశతో ఉండగా.. పోలీసులు పుంగనూరు ఘటనలో అక్రమ రౌడీ షీట్ తెరిచారు. ఇప్పుడు ఆయన ఉమ్రాకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.



ఇతను జడల రాజేంద్ర. రొంపిచెర్ల మండలం వారణాసి వారిపల్లె. ఈయన ప్రైవేటు పాఠశాల టీచర్‌గా పనిచేస్తున్నారు. పుంగనూరు అల్లర్ల సమయంలో అక్కడ లేరు. టీడీపీ సానుభూతిపరుడనే కారణంగా గతంలో ఎలాంటి కేసులు లేకున్నా.. రౌడీషీట్ తెరిచారు.



ఇతను గూడూరు శ్రీహరి. పుంగనూరు ఘటన సమయంలో డిగ్రీ చదువుకుంటూ ఉన్నాడు. చెంచురెడ్డి గారిపల్లెకు చెందిన ఇతనిపై కూడా రౌడీ షీట్ తెరవడంతో అప్పటినుంచి ఏ ఉద్యోగానికీ అర్హత సాధించలేకపోతున్నాడు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

- వారం రోజుల్లోనే ఛేదించిన పోలీసులు -



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ ప్రభాకర్, సీఐ నరసింహరాజు

పలమనేరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలో ఈనెల 13వ తేదీన జరిగిన శివకుమార్(40) హత్య కేసును పోలీసులు వారం రోజుల్లోనే ఛేదించారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో నిందితుడిని అరెస్టు చూపుతూ మీడియాకు వివరాలు తెలిపారు. పలమనేరు మండలం ముసలిమడుగుకు చెందిన శివకుమార్ భార్య ఉషారాణి గడ్డూరు క్రాస్‌లోని చార్మినార్ బిరియాని సెంటర్ నిర్వాహకుడు షామీర్ వద్ద ఎనిమిది నెలలుగా పనిచేస్తోంది. ఈ క్రమంలో ఉషారాణితో షామీర్.. వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. భర్తకు విషయం తెలియడంతో తరచూ గొడవలు జరిగేవి. ఈనేపథ్యంలో షామీర్ గత నెల మూడో తేదీన ఉషారాణిని బెంగళూరుకు తీసుకెళ్లాడు. ఇది తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు శివకుమార్ సిద్ధపడ్డాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇబ్బందులు వస్తాయని ఉషారాణిని ఆమె పుట్టినిల్లు అయిన తమిళనాడులోని వేలూరు సమీపం సదువాని గ్రామానికి పంపేశాడు. తర్వాత పెద్దలసమక్షంలో మాట్లాడి ఉషారాణిని భర్తతో ముసలిమడుగుకు పంపారు.ఈ నేపథ్యంలో ఉషారాణిని ఇకపై కలుసుకోనని శివకుమార్‌ను షామీర్ నమ్మించాడు. సన్నిహితంగా మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన పలమనేరు పొలిమేరల్లోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వెనుక వైపునకు తీసుకెళ్లి మద్యం తాగించాడు. మత్తులో ఉన్న శివకుమార్‌పై ఓ బండరాయి వేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పలమనేరులోనే ఉంటే పోలీసులు పట్టుకుంటారని భావించిన షామీర్.. బెంగళూరుకు వెళ్లిపోయాడు. ఈ హత్య కేసును దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితుడు బంగారుపాళ్యం సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద ఉన్నట్లు సమాచారం అందింది. దాంతో పలమనేరు సీఐ నరసింహరాజు తమ సిబ్బందితో వెళ్లి షామీర్‌ను అరెస్టు చేశారు. ఈ సమావేశంలో పలమనేరు ఎస్ఐ స్వర్ణతేజ పాల్గొన్నారు.

జిల్లా అంతటా వర్షం

చిత్తూరు సెంట్రల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. శనివారం ఉదయం 8 నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. విజయపురం మండలంలో అత్యధికంగా 36.4 మి.మీ, అత్యల్పంగా పెద్దపంజాణి, సదుం మండలాల్లో ఒక్క మి.మీ వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో ఇలా.. నింద్రలో 33.2, ఎస్ఆర్‌పురంలో 23.4, వెదురుకుప్పంలో 21.2, కార్వేటినగరంలో 20.4, నగరిలో 17.6, పెనుమూరులో 11.2, పులిచెర్లలో 8, చిత్తూరు రూరల్‌లో 7.4, జీడీ నెల్లూరులో 7, పాలసముద్రంలో 6.9, చిత్తూరు, శాంతిపురంలో 6.2, గుడిపాలలో 6, రొంపిచెర్ల, యాదమరిలో 5.8, రామకుప్పంలో 4.2, వి.కోటలో 3.4, పూతలపట్టులో 2.4, సోమలలో 2.2, ఐరాల, పుంగనూరు, బంగారుపాళ్యంలో 2, తవణంపల్లె, పలమనేరు, బైరెడ్డిపల్లెలో 1.4, చౌడేపల్లె, గంగవరం, కుప్పంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



విజయపురం మండలంలోని ఇళ్లత్తూరు - చివ్వాడ రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

నేలకొరిగిన వరి



కమ్మకండ్రిగ వద్ద నేలకొరిగిన వరిపంట

విజయపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండలంలో శనివారం రాత్రి, ఆదివారం ఉదయం కుండపోత వాన కురిసింది. పాతార్కాడు, మంగళం, శ్రీహరిపురం, మహవీరపురం, పన్నూరు చెరువులు మొరవపారాయి. ఇళ్లత్తూరు వద్ద చెరువు వరవ కాలువ ఆక్రమణకు గురి కావడంతో వర్షపు నీరు ఇళ్లత్తూరు - చివ్వాడ రోడ్డుపై ప్రవహించడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ సమస్యను అధికారులు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఇక కమ్మకండ్రిగలో నూర్పిడికి సిద్ధంగా ఉన్న వరిపంట నేలకొరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

పచ్చదనం కనుమరుగు



మేత బయలు భూముల్లో పడేసిన వ్యర్థాలు

- మేత బయలు భూముల్లో వ్యర్థాలను పడేస్తున్న ప్రైవేటు సంస్థ
- ఆవేదనలో స్థానికులు

చిత్తూరు అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మేత బయలుకు కేటాయించిన భూముల్లో ఓ ప్రైవేటు సంస్థ.. వ్యర్థాలను నింపుతుండటంతో పచ్చదనం కనుమరుగవుతోంది. చిత్తూరు మండలం మాపాక్షి రెవెన్యూ దాఖలాలో సర్వే నెంబరు 278లో 475 ఎకరాల మేత బయలు భూములున్నాయి. ఈ భూముల్లో తరతరాలుగా సమీప గ్రామాలైన మాపాక్షి, మాపాక్షి దళితవాడ, ఉయ్యాలచింత, శేషాచలపురం, శేషాచలపురం దళితవాడ ప్రజలు ఆవులు, మేకలను మేపుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ భూములన్నీ చదరంగా ఉండటంతోపాటు వర్షాకాలంలో పచ్చదనాన్ని పంచేవి. కొంతకాలంగా చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేస్తున్న ఓ ప్రైవేటు నిర్మాణ సంస్థ.. రాళ్లు, ఇతరాలను తెచ్చి దాదాపు 90 ఎకరాల మేత బయలు భూముల్లో పడేసింది. దీనివల్ల ఆ భూమిలో పచ్చదనం కరువై.. రాళ్ల గుట్టగా మారుతోంది. సమీప గ్రామాలవారు రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో గడ్డి మొలిచే అవకాశం లేనందున మూగజీవాలను అమ్ముకుంటున్నారు. ఇక ప్రైవేటు సంస్థ నిర్వాకంపై మండల, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు వాపోయారు. అధికార యంత్రాంగం పట్టించుకోక పోవడంతో హైకోర్టులో కూడా కేసు వేశామన్నారు. ఇక్కడ వ్యర్థాలను వేయకూడదని న్యాయస్థానం స్టే ఇచ్చిందన్నారు. అయినా కూడా ఆ సంస్థ మేత బయలు భూముల్లో వ్యర్థాలను పడేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రంకేసిన కోడెగిత్తలు

- జనసంద్రమైన పెద్దఉప్పరపల్లె



పరుగులు తీస్తున్న కోడెగిత్తలు

సోమల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో ఆదివారం జల్లికట్టు జరిగింది. చుట్టుపక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పెద్దఉప్పరపల్లె జనసంద్రంగా మారింది. రెడ్డివారిపల్లె, చిన్నఉప్పరల్లె, ఆవులపల్లె, పత్రపల్లె, బసవపల్లె, బోనమంద, పత్రపల్లె, నంజంపేట తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన కోడెగిత్తలను అల్లెలోకి వదిలారు. రంకెలేస్తూ పరుగులు తీసిన కోడెగిత్తలను నిలువరించడానికి యువకులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా పలువురు గాయపడ్డారు. కాగా, కాటమరాజు ఆలయం వద్ద స్వామివారికి మహిళలు పొంగళ్లు సమర్పించారు. చిట్లాకుప్పకు నిప్పు పెట్టి.. పశువులను ప్రదక్షిణలు చేయించారు. మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, బాలాజినాయుడు, యధుశేఖర్‌నాయుడు, హేమగిరి, రెడ్డెప్పనాయుడు, యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.



మిద్దెల పైకెక్కి జల్లికట్టును వీక్షిస్తున్న జనం

పోలీస్‌స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్యాయత్నం

- బాధితుడిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు

రామకుప్పం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ గెర్నిపల్లెలో రషీద్ నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ యువకుడితో తన భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందని తెలిసింది. మనస్తాపానికి గురైన అతను ఈ విషయాన్ని స్థానిక పెద్దలు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరాడు. ఈ నేపథ్యంలో ఏం జరిగిందో ఏమో ఆదివారం సాయంత్రం పోలీస్‌స్టేషను ఎదుట రషీద్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన పోలీసులు అతడిని రామకుప్పం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స తర్వాత కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



రషీద్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చితూరు అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. అలాగే ఆయా మండల, నియోజకవర్గాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, వారి సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు.



కబడ్డీ.. కబడ్డీ







నృత్యోత్సవం



అటవీ శాఖ స్టాల్ వద్ద జన సందడి





జాతరలా ఫ్లెమింగో ఫెస్టివల్

పోటెత్తిన జనం









సందర్శకులు



సూళ్లూరుపేటలోని జూనియర్ కళాశాల వద్ద ఉత్సాహంగా ఆటలాడుతున్న విద్యార్థులు



పక్షులతో పోటీపడి...

దొరవారిసత్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ రెండో రోజు నేలపట్టు సందర్శకుల రద్దీతో సందడిగా కనిపించింది. చెరువులోని కడపచెట్లమీద పక్షులతో పోటీపడి చెరువు కట్టమీద సందర్శకులు కిటకిటలాడారు. ఉదయం చిరు జల్లుల వల్ల జనం పలుచగా కనిపించినా 11 తర్వాత వెల్లువలా వచ్చారు. పక్షుల కేంద్రంలోని అన్నీ రోడ్లు జనంతో నిండిపోయాయి. సెలవురోజు కావడంతో చెన్నై నుంచి ఉద్యోగుల కుటుంబాలు పెద్ద సంఖ్యలో వచ్చాయి. అలాగే శ్రీసిటీ, మేనకూరు, మాంబట్టు సెజ్‌ల్లోని పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు కూడా భారీగానే వచ్చారు. నెల్లూరు, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, సత్యవేడు, వరదయ్యపాళెం, ఆరంబాకం, గుమ్మిడిపూడి ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 10 వేలమంది నేలపట్టును సందర్శించినట్టు అంచనా. పక్షుల వీక్షణ కోసం ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్ వద్ద సందర్శకులను కంట్రోలు చేయడం కష్టంగా మారింది. చెరువు కట్టమీద ఉన్నవారిని పోలీసులు కట్టకింది మార్గం ద్వారా బయటకు పంపే ఏర్పాటు చేయడంతో ఒత్తిడి తగ్గింది. కేంద్రంలోని పక్షుల చిత్రాలు, ఫిల్మ్ షో సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఇక్కడ కొన్ని స్టాల్స్ ఏర్పాటు చేసివుంటే మరింత ఉపయోగకరంగా ఉండేది.

హైలెస్సో.. హైలెస్సా

వరదయ్యపాళెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తడ మండలం భీములవారిపాలెం ఓడ రేవు నుంచి రెండో రోజూ సందర్శకులు పడవ షికారు చేశారు. 8 పాయింట్ల వద్ద 30 బోట్లను అందుబాటులో ఉంచినట్లు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఒక్కో బోటుకు పది మంది చొప్పున కేటాయించి వారికి సేఫ్టీ జాకెట్ ఇచ్చి షికారుకు తీసుకెళ్లారు. 1.55 కిలోమీటర్ల మేర పడవ షికారు చేశారు. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు అధికంగా వచ్చారు. నిప్పో పరిశ్రమ తరఫున అన్నదానం నిర్వహించారు. తాగు నీరు, వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచారు. ఇక, కలెక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కూడా బోటు షికారు చేశారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు ఎంతో మానసికోల్లాసంతో గడుపుతారన్నారు.

బోటు షికారుతో ఆనందం

నాలుగేళ్ల తర్వాత ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించడం సంతోషంగా ఉంది. ఈ సారి ప్రభుత్వం బోటు షికారు ఏర్పాటు చేసింది. పక్షుల పండుగ కార్యక్రమంలో పాల్గొని, మేమంతా బోటు షికారు చేయడం ఆనందాన్నిచ్చింది.

- నూర్జహాన్, నాయుడుపేట

కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారానికి రచనల ఆహ్వానం

చిత్తూరు కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యుదయ రచయితల నుంచి రచనలను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు పి.రోజారెడ్డి తెలిపారు. 2024వ సంవత్సరంలో పత్రికల్లో ప్రచురితమై.. పాఠకుల అభిమానం పొందిన కథలు (సంపుటాలు), కవితలు, నవలలు, చంధోపద్య కవిత్వం, వచన కవిత్వానికి రానున్న శ్రీరామనవమి పండుగ రోజున కుప్పం రెడ్డెమ్మ జయంతి ఉత్సవాల్లో బహుమతులు అందించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి సి.నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఒక్కో విభాగం నుంచి ఉత్తమ రచనలకు రూ.10వేలతోపాటు ఘన సత్కారం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల ఉమ్మడి రాష్ట్రాల రచయితలు, సాహితీవేత్తలు తమ రచనలను మూడేసి కాపీల చొప్పున ఫిబ్రవరి పదో తేదీలోపు డాక్టర్ కె.రామలక్ష్మి, రామలక్ష్మి నర్సింగ్‌హోమ్, 17-434 సుందరయ్యవీధి, చిత్తూరు-517001 అనే చిరునామాకు పంపాలని కోరారు.

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా కన్నన్



కె.ఎస్.కన్నన్ - ఎ.విజయ్‌భాస్కర్‌రెడ్డి

చిత్తూరు సెంట్రల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రోగ్రసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియర్ (పీఆర్‌టీయూ) జిల్లా అధ్యక్షుడిగా కె.ఎస్.కన్నన్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక గిరింపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. అధ్యక్షుడు వి.ప్రకాష్ ఇటీవల పదవీ విరమణ చెందడంతో జిల్లా అధ్యక్షుడి స్థానంతోపాటు కార్యవర్గాన్ని నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎ.విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.నరేంద్రరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా మోహన్, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ప్రకాష్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనాకాచారి, పరిశీలకుడిగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రమణ వ్యవహరించారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి



సునందమ్మ (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలంలోని మొగిలివారిపల్లె గ్రామానికి చెందిన లేట్ రాజేంద్రనాయుడు భార్య సునందమ్మ(71).. బంగారుపాళ్యం ఆర్‌ఆర్‌నగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకున్నారు. శనివారం ఆమె మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుమారుడు సంతోష్‌కుమార్ తల్లి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లాడు. అయితే తన తల్లి మృతిపై అనుమానం ఉందని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులొచ్చి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల అప్పీల్ కార్యక్రమం 22కు వాయిదా

చిత్తూరు అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ అభ్యర్థుల అప్పీల్ కార్యక్రమాన్ని ఈనెల 20 నుంచి 22వ తేదీకి వాయిదా వేసినట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా కానిస్టేబుల్ అభ్యర్థులకు చిత్తూరు పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో దేహదారుఢ్య, సామర్థ్య పరీక్షలు శనివారంతో ముగిశాయని పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియపై అప్పీల్ చేయదలచిన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీన రావాల్సి ఉండగా.. వర్షాల కారణంగా 22వ తేదీకి వాయిదా వేశామన్నారు. అభ్యర్థులు ఈ మార్పును గమనించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీలకు చేయూత

- ఉచితంగా సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- నేటిలోపు సూర్యఘర్ పథకానికి పేర్లు రిజిస్ట్రేషన్లు చేసేలా డెడ్‌లైన్



బంగారుపాళ్యంలో లబ్దిదారుడితో రిజిస్ట్రేషన్ చేయిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద ప్రతి ఇంటికీ సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు ఈ పథకం కింద ఉచితంగా సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వీరికి సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేస్తే 25 ఏళ్ల వరకు విద్యుత్ ఆదా అవుతుందని అధికారులు చెబుతున్నారు.

ఇంటింటికీ అధికారులు: జిల్లాలో 84,429 ఎస్సీ, ఎస్టీ సర్వీసులు ఉన్నాయి. ఇందులో ఒక్కో పేరుపై రెండు అంతకన్నా ఎక్కువ సర్వీసులు కూడా ఉన్నాయి. వీటిపై ప్రస్తుతం విద్యుత్ శాఖ అధికారులు ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు 55,641 మందితో సూర్యఘర్ పథకం కింద వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేయించారు. మిగిలిన వారి రిజిస్ట్రేషన్లు కూడా సోమవారంలోగా పూర్తి చేయాలని అధికారులకు డెడ్‌లైన్ పెట్టారు.

ఎస్సీ, ఎస్టీల సర్వీసులు.. రిజిస్ట్రేషన్ల వివరాలు

డివిజన్	ఎస్సీ సర్వీసులు	ఎస్టీ సర్వీసులు	రిజిస్ట్రేషన్ చేయించుకుంది ఎస్సీలు	ఎస్టీలు
చిత్తూరు ఆపరేషన్	28439	2017	19203	1207
చిత్తూరు రూరల్	26792	2288	15806	811
పుంగనూరు	21548	3345	17201	1413
మొత్తం	76779	7650	52210	3431

వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తాం



గడువులోగా వంద శాతం రిజిస్ట్రేషన్లను పూర్తి చేస్తాం. ఇప్పటి వరకు జిల్లాలో 55 శాతం మందితో రిజిస్ట్రేషన్లు చేయించాం. సోలార్ ప్యానళ్లు ఉచితంగా ఏర్పాటు చేస్తామని వివరించి లక్ష్యం పూర్తి చేస్తాం.

- ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ

శోకసంద్రంలో కందువారిపల్లె పంచాయతీ

ఉప సర్పంచి రాకేష్ చౌదరికి కన్నీటి వీడ్కోలు ● పాడె మోసిన ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ నేతలు



పాడె మోస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు

చంద్రగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో ఉప సర్పంచ్ రాకేష్‌చౌదరి మృతి చెందడంతో కందులవారిపల్లె పంచాయతీలో విషాదచాయలు అలముకున్నాయి. ఈ ఘటన తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి శనివారం అర్ధరాత్రి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన తనయుడు వినీల్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, టీడీపీ నాయకులు చేరుకున్నారు. చంద్రగిరి సీహెచ్‌సీలో పోస్టుమార్టం పూర్తయ్యాక ఆదివారం ఉదయం 10 గంటలకు రాకేషచౌదరి భౌతికకాయాన్ని స్వగ్రామమైన మామిడిమానుగడ్డకు తరలించారు. అప్పటికే టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు అంత్యక్రియలు ఏర్పాట్లు చేశారు. నాని, రవినాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు పాడె మోశారు. భౌతికకాయంపై టీడీపీ జెండా కప్పి అంత్యక్రియలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి, నాయకులు సుధారెడ్డి, వీరపల్లి హేమాంబరదరరావు, సుబ్రమణ్యంనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, సింగు సుధా, గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, కొండూరు ప్రవీణ్‌రాయల్ తదితరులు నివాళులర్పించారు.

పార్టీ అండగా ఉంటుంది: నాని

రాకేష్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే నాని భరోసా ఇచ్చారు. టీడీపీ నుంచి రూ.5 లక్షల బీమా వస్తుందని టీడీపీ నాయకులు తెలిపారు. మంచివ్యక్తిని కోల్పోయామని సినీనటుడు నారారోహిత్ ట్వీట్ చేశారు. కాగా, అటవీశాఖ అధికారులు తీసుకొచ్చిన రూ.10 లక్షల చెక్కును.. విషాదంలో ఉన్న మృతుడి కుటుంబ సభ్యులు తిరస్కరించినట్లు తెలిసింది.

28న సుభాష్ పాలేకర్ రాక

ప్రకృతి సేద్యంపై ఎస్వీయూలో సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ సుభాష్ పాలేకర్ ఈనెల 28వ తేదీన తిరుపతికి రానున్నారు. ఉదయం 10 గంటలకు శ్రీనివాస ఆడిటోరియంలో నిర్వహించే ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని వర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించనుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఔత్సాహిక రైతులతో సుభాష్ ముచ్చటిస్తారు. ప్రవేశ రుసుం రూ.50గా నిర్ణయించారు. ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామీణ స్థాయికి విస్తరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని సమన్వయకర్తలు డాక్టర్ గంగాధరం, డాక్టర్ పాకనాటి హరికృష్ణ తెలిపారు. ఆసక్తి కల్గినవారు 9849059573, 9247118843లను సంప్రదించాలని కోరారు.

ఏనుగు దాడిలో షెడ్డు, గడ్డికోత యంత్రం ధ్వంసం

రూ.లక్ష ఆస్తి నష్టం





ధ్వంసమైన రేకుల షెడ్డు, గడ్డికోత యంత్రం

బంగారుపాళ్యం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఒంటరి ఏనుగు దాడిలో పశువుల కోసం వేసిన రేకుల షెడ్డు, గడ్డికోత యంత్రం ధ్వంసమయ్యాయి. బంగారుపాళ్యం మండలం మొగిలి గ్రామానికి చెందిన నారాయణమ్మకు గౌనిచెరువు సమీపంలో వ్యవసాయ పొలం ఉంది. అక్కడ తన పాడి ఆవులకు రేకుల షెడ్డు నిర్మించి.. అందులో గడ్డికోత యంత్రాన్ని అమర్చారు. శనివారం రాత్రి ఈ పొలంపైపడ్డ ఒంటరి ఏనుగు.. షెడ్డును, గడ్డికోత యంత్రాన్ని ధ్వంసం చేసింది. మామిడి చెట్లను విరిచేసింది. తనకు రూ.లక్ష మేర ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒంటరి ఏనుగు నెల కిందట కూడా ఓ గుడిసెను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఒంటరి ఏనుగు ఎప్పుడు దాడి చేస్తుందోనని స్థానిక రైతులు భయపడుతున్నారు. అటవీ అధికారులు తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

గంటపాటు రక్తమోడుతూ..!

- ప్రమాదంపై సకాలంలో స్పందించని పోలీసులు.. రాని హైవే అంబులెన్సు
- ఆలస్యంగా ఆస్పత్రికి తరలింపు
- ప్రమాద స్థలంలో ఇద్దరు పిల్లల దుర్మరణం
- చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి
- మృతులు, క్షతగాత్రులది కోయంబత్తూరు

చంద్రగిరి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గోల్డెన్ అవర్. ప్రమాదాలు జరిగినప్పుడు వీలైనంత త్వరగా ఆస్పత్రికి తీసుకెళ్లాలి. ఏమాత్రం ఆలస్యం జరిగిన తీవ్రంగా గాయపడినవారి ప్రాణాలుపోవచ్చు. కానీ,ఆదివారం సాయంత్రం చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ రవణప్పగారిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరు మృతిచెందగా.. క్షతగాత్రులు గంటపాటు రక్తమోడుతూ విలవిలలాడుతూ గడపాల్సి వచ్చింది. హైవేపై గస్తీ తిరిగే పోలీసులు.. హైవే అంబులెన్సు సకాలంలో రాకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. తిరుమల శ్రీవారి దర్శనార్థం భార్య ఐశ్వర్య, కుమారులు జీవన్, విశ్వ, అత్త కలైవాణి, బావమరిది సతీష్‌తో కలిసి కోయంబత్తూరుకు చెందిన కార్తికేయ కారులో బయలుదేరారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు రవణప్పగారిపల్లె వద్ద వీరి కారు లారీని ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జు నుజ్జవడంతో ముందు సీట్లోని జీవన్(10), విశ్వ(8) అక్కడిక్కడే మృతిచెందారు. మిగిలినవారు తీవ్రగాయాలతో అల్లాడుతున్నా హైవేలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు కానీ, కేవలం జాతీయ రహదారిలో జరిగే ప్రమాదాలకు మాత్రమే వచ్చే అంబులెన్స్ కానీ రాలేదు. ఈ ప్రమాదంతో కిలోమీటర్ల కొద్దీ వాహనాల రాకపోకలు స్తంభించాయి. కూతవేటు దూరంలోనే టోల్ ప్లాజా ఉంది. గంటపాటూ క్షతగాత్రులకు సాయం అందలేదు. చివరకు స్థానికుల సమాచారంతో పాకాల నుంచి ఆరు గంటలకు 108 అంబులెన్స్ వచ్చింది. క్షతగాత్రులను తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 8 గంటల ప్రాంతంలో కలైవాణి(45) మృతిచెందారు. కారు నడుపుతున్న కార్తికేయ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఐశ్వర్య, ఆమె సోదరుడు సతీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటన స్థలంలో మృతిచెందిన జీవన్, విశ్వ



ఆస్పత్రిలో మృతి చెందిన కలైవాణి

రాళ్లబూదుగూరు రూపురేఖలు మారుస్తాం

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలంలోని రాళ్లబూదుగూరును మండల కేంద్రంగా ఏర్పాటు చేసి, అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చెర్మన్ మునిరత్నంలు తెలిపారు. ఆదివారం వారు దేవాదాయశాఖ అధికారులు, స్థానిక నేతలతో కలిసి స్థానిక కోదండరామస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికుల కోరిక మేరకు కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ.7.85 కోట్లు మంజూరు చేశారన్నారు. త్వరలోనే ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయన్నారు. అదనపు నిధులు మంజూరు చేయించి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా పునర్నిర్మాణం చేస్తామని వారు తెలిపారు. రాళ్లబూదుగూరును మండల కేంద్రంగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు గంగయ్య, జనార్దన్, చిట్టెమ్మ, ఆనంద్, టీడీపీ నేతలు విశ్వనాథనాయడు, చంద్రశేఖర్, విజయరామిరెడ్డి, మణి, జయరాజ్‌కుమార్, రమేష్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1979-80లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు

కల్లూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మంగళంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1979-80 సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు 44 ఏళ్ల అనంతరం ఒకే వేదికపై కలుసుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకే చోట చేరి అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదివిన బడి, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. రోజంతా సంతోషంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులు యర్రయ్య, అబ్దుల్ మునాఫ్, హరినాథ్‌ను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాసులురెడ్డి, మధుమూర్తి, మోహన్, రామచంద్రనాయుడు, ఉషారాణి, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ

చౌడేపల్లె, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో కిక్కిరిసింది. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకాలు.. అర్చనలు చేసి స్వర్ణాభరణాలు.. పూలతో అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.


అలంకరణలో గంగమ్మ

పలమనేరు వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలిగా రమ్యహరీష్



రమ్యహరీష్‌తో వాసవి వనిత క్లబ్ సభ్యులు

పలమనేరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పలమనేరు వాసవి వనిత క్లబ్ నూతన అధ్యక్షురాలిగా బి. రమ్య హరీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆదివారం పలమనేరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన వాసవి వనిత క్లబ్ సభ్యులు బి.రమ్యహరీష్‌ను ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో పలమనేరు ఆర్యవైశ్య మండలి అధ్యక్షులు ఆర్.వి. సుభాష్ చంద్రబోస్, వాసవి వనిత క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రామకృష్ణ, జిల్లా గవర్నర్ యశస్విగుప్తాతోపాటు సభ్యులు రమ్య హరీష్, ఉషాప్రకాష్, దీప్తి బాలాజీ, కవిత కుమార్, విజయప్రసాద్, లక్ష్మీరాజు, ఆర్.మాధవి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక బాలికోన్నత పాఠశాలలో వంటగది ఉరుస్తున్నందున ఆ పైకప్పు వేయడానికి వాసవి వనిత క్లబ్‌చే విరాళం అందించారు. అలాగే మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తేనే ఆరోగ్యం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుంగనూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రసుత్తం తయారవుతున్న ఆహార పదార్థాల కారణంగా అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని.. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని మానవత సేవా సంస్థ డాక్టర్ ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో మానవతసేవా సంస్థ, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బీపీ, షుగర్ వ్యాధులకు డాక్టర్లు ప్రభాకర్, విజయ కుమారి దాదాపు 40 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షుగర్, బీపీ వ్యాధులు ఉన్న వ్యక్తులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. రోజూ వ్యాయామం, నడవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు, మానవత సేవా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు గాయపడిన సంఘటన ఆదివారం పుంగనూరులో జరిగింది. వివరాలు.. పట్టణంలోని ఎన్ఎస్‌పేటకు చెందిన కుమార్(30) ద్విచక్రవాహనంలో కుమ్మరివీధిలోకి వెళుతుండగా మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో కుమార్ గాయపడ్డాడు. గాయపడిన కుమార్‌ను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

గూళిపల్లెలో పశువుల పండుగ


ఎద్దులను నిలువరిస్తున్న యువకులు

రామకుప్పం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఉన్సిగానిపల్లె పంచాయతీ గూళిపల్లెలో ఆదివారం పశువుల పండుగ కోలాహలంగా జరిగింది. మొదట గ్రామంలోని రైతులు తమ పశువులను రంగుల కాగితాలతో అలంకరించి వీధుల్లో ఊరేగించారు. గ్రామదేత ఆలయం వద్ద పూజలు చేశారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు తమ ఎద్దులను పరుగులు తీయించారు. వేగంగా పరుగెడుతున్న ఎద్దులను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు.

ముసురుతో జనజీవనం అస్తవ్యస్తం


నిర్మానుష్యంగా ఉన్న రామకుప్పం బజారువీధి

రామకుప్పం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి తేలికపాటి వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం వరకు వీడని ముసురు వానతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ముసురు వాన, చలి తీవ్రతతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. వీధులు జనసంచారం లేక వెలవెలబోయాయి. రెండు రోజులకోసారి ముసురు వాన వస్తుండటంతో ఉద్యాన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. బంగాళాదుంప, టమోటా, బీన్స్, మొక్కజొన్న, మిరప పంటలు సాగుచేస్తున్న రైతులు తమ పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడి పూత సైతం దెబ్బ తింటుందని మామిడి రైతుల్లో ఆందోళన నెలకొంది.

పలమనేరు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రంజిత్‌షా

పలమనేరు, జవవరి 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రంజిత్‌షాను ఆదివారం క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఆర్.ఎన్ హరికృష్ణ, నూతన సాయిప్రతాప్, మన్సూర్, కిషోర్, ప్రధాన కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, ట్రెజరర్‌గా గిరిబాబు, జాయింట్ సెక్రటరీలుగా ధీరజ్‌క్రాంతి, సురేష్, బ్రహ్మకుమార్, శ్రీనివాసులు, గణపతి, ఫయాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సుదర్శనకుమార్, హేమంత్, జాకీర్, బాలాజీ, అసోసియేషన్ సభ్యులుగా బాలాజీ, షహిన్షా అజయ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎంపికచేశారు.


రంజిత్‌షా

పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం


గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాడిరైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. ఆదివారం ఉన్సిగానిపల్లె పంచాయతీ గూళిపల్లెలో గోకులం షెడ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాడిరైతులందరికీ గోకులం షెడ్లను నిర్మించుకునేందుకు ప్రభుత్వం దశల వారీగా చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రామ్మూర్తి, శ్రీనివాసులురెడ్డి, మహాదేవిజయశంకర్, నేతలు కృష్ణారెడ్డి, మహేంద్రనాయుడు, శంకర్ చలం, మణేష్, రామలింగం, అంజనేయులు, సుభాష్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


సీఏ ఫైనల్లో రిషబ్ ఓస్వాల్‌కు ఆలిండియా ప్రథమ ర్యాంకు


సీఎంను కలిసిన విద్యార్థులు, డైరెక్టర్, ప్రిన్సిపాల్ తదితరులు

తిరుపతి(విద్య), జనవరి 19(ఆంధ్రజ్యోతి): సీఏ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థి చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన ఆర్.రిషబ్ ఓస్వాల్ ఆలిండియా ప్రథమ ర్యాంకు సాధించాడని కళాశాల అడ్మిన్ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్, అడ్మిన్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. తమ విద్యార్థులు ఎం.మోహన్ ఆలిండియా 33వ ర్యాంకు, కె.సాయిచరణ్ 34, కె.కృష్ణచైతన్య 40వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. శనివారం సీఎం చంద్రబాబును ఆయన నివాసంలో కలవగా అభినందించినట్లు చెప్పారు.

తరతరాలకు ఆదర్శప్రాయులు అంబేడ్కర్

సదుం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ తరతరాలకు ఆదర్శప్రాయులని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అన్నారు. సదుం మండలం బూరగమంద పంచాయతీ రామాపురంలో దళితులు ఏర్పాటు చేసుకున్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జూపూరి ప్రభాకర్‌రావు, మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, ఎంపీపీ ధనంజయరెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి సుధీర్ కుమార్‌రెడ్డి, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.



మురుగుతున్న గ్రామాలు..!


కంగుంది కాలనీలో తాగునీటి బోరుచుట్టూ మురుగునీరు


మహమ్మద్‌పురంలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

● పల్లెల్లో పారిశుధ్యం అంతంతమాత్రం
● తరచూ తాగునీటి కాలుష్యం
● వ్యాధుల బారిన ప్రజలు

కుప్పం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని గ్రామాల్లోని ప్రజలు మురుగునీటి నిర్వహణ వ్యవస్థ లేక పారిశుధ్య లోపంతో అల్లాడుతున్నారు. కుళాయిలు, బోర్ల చుట్టూ మురుగు నిల్వ కారణంగా తాగునీటి కాలుష్యంతో అనారోగ్యాల బారిన పడుతున్నారు. కుప్పం నియోజకవర్గంలోని పంచాయతీల్లోని పలు గ్రామాల్లో సిమెంటు రోడ్లు నిర్మించారు గాని.. మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయడం మరచిపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. పలు గ్రామాల్లో ఇళ్లముందు సిమెంటు రోడ్లు ఉన్నా, మురుగునీటి కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని మురుగునీరు మొత్తం ఈ రోడ్లపై ప్రవహిస్తోంది. ఈ మురుగునీరు గ్రామంలోని తాగునీటి కుళాయిల చుట్టూ చేరి పోయి నీటి కాలుష్యం జరుగుతోంది. కుప్పం మండలం పంచాయతీ కేంద్రమైన మహమ్మద్ పురంలో సిమెంటు రోడ్లపైనే మురుగునీరు పారుతోంది. ఈ మురుగు తాగునీటి కుళాయిలను తాకుతూ ఆర్ అండ్ బీ రహదారిపైకి చేరిపోతోంది. కంకర తేలి రోడ్డుపై పడిన గుంతల్లో చేరుతోంది. ఈ మురుగునీటి కారణంగా గ్రామంలో పారిశుధ్యం లోపిస్తోంది. కేవలం తాగునీటి కుళాయిలే కాదు.. చేతిబోర్లు సైతం మురుగు నీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఉదాహరణకు పంచాయతీ కేంద్రమైన కంగుంది కాలనీలో తాగునీటి బోరు చుట్టూ మురుగునీరు మడుగు కట్టింది. ఈ కాలనీకి సిమెంటు రోడ్డు ఉన్నా.. మురుగునీటి కాలువ లేకపోవడంతో ఇళ్ల నుంచి మురుగు మొత్తం కిందికి ప్రవహించి బోరు వద్ద చేరుతోంది. దీంతో కాలనీవాసులు ఆ మురుగునీరు ఇంకిన కలుషిత బోరు నీటినే తాగి అనారోగ్యాల పాలవుతున్నారు. ఈనెల 7వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కంగుంది గ్రామానికి వచ్చి ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం తండ్రి, మాజీ సర్పంచి శ్యామన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆ సమయంలోనూ అత్యంత సమీపంలో ఉన్న కంగుంది కాలనీలోని చేతిబోరు చుట్టూ చేరిన మురుగునీటి మడుగు తొలగించడానికి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మురుగు కాలువలు లేకపోవడంతో పలు గ్రామాల్లో పారిశుధ్య సమస్యతోపాటు తాగునీటి కాలుష్యం సమస్యలు అధికంగా ఉన్నాయి.

పనులు వెంటనే ప్రారంభం కావాలి

నిజానికి కుప్పం నియోజకవర్గంలో ఉన్న మురుగునీటి సమస్యను ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 6, 7 తేదీలలో జరిపిన కుప్పం నియోజకవర్గ పర్యటనలో మురుగునీటి కాలువల నిర్మాణానికి రూ.110.21 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అధికారులు రూపొందించిన నివేదిక ప్రకారం ఈ నిధులతో నియోజవర్గ పరిధిలో 451 మురుగునీటి కాలువలను నిర్మించనున్నారు. ఈ పనులు వెంటనే ప్రారంభం కావాలని ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ మరో సమస్య ఉంది. అధికారులు నివేదించిన 451 పనులలో నిజంగా అవసరమైన చోట మురుగునీటి కాలువల నిర్మాణాలు ఉన్నాయో లేదో తెలియదు. ఒకవేళ లేకపోతే ఇప్పటికైనా అవసరాలను గుర్తించి ఆయా గ్రామాలలో మురుగునీటి కాలువల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. మురుగునీటి కాలువల నిర్మాణం ఎంత త్వరగా జరిగితే కుప్పం గ్రామాల ప్రజలు అంత త్వరగా పారిశుధ్యం, తాగునీటి కాలుష్యం, అనారోగ్యాల సమస్యల నుంచి బయట పడుతారు.

ఘనంగా యోగి వేమన జయంతి

పలమనేరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం యోగి వేమన జయంతిని ఘనంగా జరుపుకున్నారు. వేమన చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ ఎన్‌వీ రమణారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్‌మేనేజర్ ఖాదర్‌మోహిద్దీన్, ఏఈ స్నేహ ప్రియ, మెప్మా సీఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

● మార్కెట్ కమిటీ వద్ద వేమారెడ్డి విగ్రహానికి యోగి వేమారెడ్డి ట్రస్టు సభ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బైరెడ్డిపల్లికి చెందిన ఓబుల్‌రెడ్డి కుమార్తె కిడ్నీమార్పిడికి రూ. 2 లక్షల చెక్కును ఓబుల్‌రెడ్డికి అందజేశారు. పలువురు ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు చెంగారెడ్డి, నాయకులు బాలాజీరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

● పలమనేరు బైపాస్ రోడ్డుపక్కన ఏర్పాటు చేసిన యోగి వేమారెడ్డి విగ్రహానికి రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. వేమన పద్యాలు ఆలపించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే కవులు, రచయితలు కుమారస్వామిరెడ్డి, మల్లిచెట్ల దేవేంద్ర, గండికోట వారిజ, రెడ్డిప్రకాష్, అశోక్, బాలకృష్ణమూర్తిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డిసంక్షేమ సంఘం అధ్యక్షులు అమరనాథరెడ్డి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జగ్గయ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు సోమసుందరంరెడ్డి, ఉమాదేవి, మీనాక్షి, టీడీపీ నాయకులు రంగనాథ్, కిషోర్‌గౌడు, విజయభాస్కర్‌రెడ్డి, జయరామిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, మల్లీశ్వరరెడ్డి, వెంకటమునిరెడ్డి, సుధాకర్, లోకేష్, శీను, సుబ్బు, బాబాజాన్, అస్లాం, మహేష్‌రెడ్డి, తాతయ్యానాయుడు పాల్గొన్నారు.


సన్మానం అందుకున్న కవులు, విద్యార్థులు



కిడ్నీ మార్పునకు ఆర్థిక సాయం అందజేస్తున్న యోగి వేమారెడ్డి ట్రస్టు నాయకులు

టీడీపీ ప్రభుత్వంలో పేదలకు న్యాయం

రొంపిచెర్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంలో పేద ప్రజలకు న్యాయం జరుగుతోందని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రొంపిచెర్ల షాదీమహల్‌లో జరిగిన టీడీపీ కార్యకర్తకు సంబంధించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు చల్లా రామచంద్రారెడ్డిని కలిసి సమస్యలు తెలియజేశారు. దీంతో ఆయన మాట్లాడుతూ ఎవరూ అధైర్యపడకండని.. ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు అవుతోందని.. రానున్న రోజుల్లో అందరికీ సముచిత న్యాయం జరుగుతుందని చెప్పారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా 50,800 మంది టీడీపీ సభ్యత్వం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గోవర్ధన్ కుటుంబ సభ్యులను కలిసి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి రవికుమార్‌నాయుడు, రాజంపేట పార్లమెంట్ టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు అంజాద్‌ఖాన్, కరీముల్లా, జి.ఇమ్రాన్‌ఖాన్, సర్పంచి ఆర్. ఇబ్రహీంఖాన్, ఉయ్యాల శశికుమార్, నాగార్జునాయుడు, రఘు, చంగల్‌రెడ్డి పాల్గొన్నారు.


కార్యక్రమంలో జ్ఞాపిక అందిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

ఘనంగా ఉబ్బదేవళ్ల వేడుకలు

పుంగనూరు రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో ఉబ్బదేవళ్ల వేడుకలను ఆదివారం వీరభద్ర రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక దోబీ కాలనీ వాసులు ఇందిరాసర్కిల్ నుంచి ప్రైవేటు బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా దోబీఘాట్‌కు చేరుకుని వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రమేశ్‌బాబు, నాయకులు నాగరాజ, రవి, శివకుమార్, రమేశ్, అంజన్‌కుమార్, ఉమాదేవి, నారాయణ, మణికంఠ, రాధాకృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


కులదేవతను ఊరేగింపుగా తీసుకెళుతున్న వీరభద్ర రజక సేవా సంఘ సభ్యులు

160 మందికి ఉచిత వైద్యసేవలు

పుంగనూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వారాహి గ్రూప్స్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన వైదేహి హాస్పిటల్ వైద్యులు మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక లినార్డు పాఠశాల ఆవరణలో వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో దాదాపు 160 మందికి పరీక్షలు నిర్వహించి 16 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య బృందం, వారాహి గ్రూప్ సభ్యులు హేమంత్‌కుమార్, రాఘవి, వరలక్ష్మి, జయలక్ష్మి, పావని, శ్రీనిధి, మానస, అను, మౌనిక, త్రిలోక్ పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైదేహి వైద్యులు

నేటి నుంచి ఉచిత వైద్య శిబిరాలు

పుంగనూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20 నుంచి 31 వరకు గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక సహాయ సంచాలకులు మనోహర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధినిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు. అలాగే పాడిరైతులకు శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజాకవి యోగి వేమన

చిత్తూరు సెంట్రల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పామరులకు సైతం అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పిన యోగి వేమన ప్రజాకవి అని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో ప్రజాకవి యోగి వేమన జయంతిని పురస్కరించుకుని జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేమన చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేమన పద్యాలు తెలుగు వారికి సుపరిచితమని, ఆటవెలదిలో సరళమైన రీతిలో హృదయాలకు హత్తుకునే విధంగా పద్యరచన చేశారన్నారు. యోగి వేమన జయంతిని ఏటా జనవరి 19న రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సమాజ చైతన్యానికి అవసరమైన సలహాలు, సూచనలు, విలువలతో కూడిన రచనలు వేమన సొంతమన్నారు. ప్రతి పద్యానికి విశ్వదాభిరామ వినుర వేమ అనే మకుటం చేర్చారన్నారు. వేమన పద్యాలను ఆంగ్ల, ఐరోపా, ద్రవిడ భాషల్లోనూ అనువదించారన్నారు. యునెస్కో విభాగం ప్రపంచ భాష కవుల్లో ఒకరిగా యోగి వేమనను గుర్తించిందని, ఇది తెలుగువారికి దక్కిన గొప్ప గౌరవమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రబ్బానీ బాష, వీఆర్‌వో ఈ చంద్రశేఖర్‌రెడ్డి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి



చిత్తూరులో ఆదివారం తెల్లవారు జాము నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. రోజంతా జల్లులతో కూడిన వర్షంతో పాటు ముసురు కమ్ముకుంది.
- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి

ప్రజాకవి యోగి వేమన



వేమన చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

చిత్తూరు సెంట్రల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పామరులకు సైతం అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పిన యోగి వేమన ప్రజాకవి అని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో ప్రజాకవి యోగి వేమన జయంతిని పురస్కరించుకుని జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేమన చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేమన పద్యాలు తెలుగు వారికి సుపరిచితమని, ఆటవెలదిలో సరళమైన రీతిలో హృదయాలకు హత్తుకునే విధంగా పద్యరచన చేశారన్నారు. యోగి వేమన జయంతిని ఏటా జనవరి 19న రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సమాజ చైతన్యానికి అవసరమైన సలహాలు, సూచనలు, విలువలతో కూడిన రచనలు వేమన సొంతమన్నారు. ప్రతి పద్యానికి విశ్వదాభిరామ వినుర వేమ అనే మకుటం చేర్చారన్నారు. వేమన పద్యాలను ఆంగ్ల, ఐరోపా, ద్రవిడ భాషల్లోనూ అనువదించారన్నారు. యునెస్కో విభాగం ప్రపంచ భాష కవుల్లో ఒకరిగా యోగి వేమనను గుర్తించిందని, ఇది తెలుగువారికి దక్కిన గొప్ప గౌరవమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రబ్బానీ బాష, పీఆర్ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర ప్రగతి సర్వేలో జిల్లాకు రెండో స్థానం రావడం అభినందనీయం: టీడీపీ



మాట్లాడుతున్న సురేంద్రకుమార్

చిత్తూరు సెంట్రల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాల సమగ్ర ప్రగతి సర్వేలో చిత్తూరు జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలవడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైకాపా పాలనలో లేని స్వేచ్ఛ కూటమి ప్రభుత్వంలో ప్రజలకు లభించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయని చెప్పారు. ఇన్‌చార్జి మంత్రి, ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యేల సహకారంలో జిల్లాలో సీసీ రోడ్లు, డ్రైనేజి పనులతో పాటు అభివృద్ధిలో ముందడుగు వేస్తుండటంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు యంత్రాంగం సమర్థవంతగా పనిచేస్తోందన్నారు. ఆరు నెలల కాలంలో చిత్తూరు ఎంపీ నిధుల నుంచి రూ.5 కోట్లతో గ్రామాలు, పట్టణాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజి పనులు చేపట్టారని చెప్పారు. మ్యాంగో బోర్డు, కేంద్రీయ విద్యాలయం స్థాపనకు చర్యలు చేపట్టారన్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని వివరించారు. టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, గోపాల్ పాల్గొన్నారు.

జిల్లాకు రెండో ర్యాంకు రావడంపై హర్షం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

పెనుమూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన ర్యాంకుల్లో చిత్తూరు పార్లమెంటుకు రెండో ర్యాంకు దక్కడంపై చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి తలారి రెడ్డెప్ప, మండల టీడీపీ అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం టీడీపీ నేతలతో కలిసి పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ జిల్లాకు రెండో ర్యాంకు రావడంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కృషి ఉందన్నారు. ఎమ్మెల్యేల సహకారంతో ఆయన ముందు చూపుతో పాకాల రైల్వే డిపో సాధించుకున్నారని, దీని వలన జిల్లా రూపురేఖలు మారబోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్, బీసీసెల్ అధ్యక్షులు అశోక్, మండల ఉపాధ్యక్షులు ప్రసాద్, మాజీ ఎంపీటీసీ గంగాధరం నాయుడు, మాజీ సర్పంచ్ రాజగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ



అలంకరణలో గంగమ్మ

చౌడేపల్లె, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో కిక్కిరిసింది. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకాలు.. అర్చనలు చేసి స్వర్ణాభరణాలు.. పూలతో అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గూళిపల్లెలో పశువుల పండుగ



ఎద్దులను నిలువరిస్తున్న యువకులు

రామకుప్పం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఉన్సిగాని పల్లె పంచాయతీ గూళిపల్లెలో ఆదివారం పశువుల పండుగ కోలాహలంగా జరిగింది. మొదట గ్రామంలోని రైతులు తమ పశువులను రంగుల కాగితాలతో అలంకరించి వీధుల్లో ఊరేగించారు. గ్రామదేత ఆలయం వద్ద పూజలు చేశారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు తమ ఎద్దులను పరుగులు తీయించారు. వేగంగా పరుగెడుతున్న ఎద్దులను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు.

ఐరాలలో చిరుజల్లులు

ఐరాల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఐరాలలో ఆదివారం ఉదయం చిరుజల్లులు కురిశాయి. ఉన్నట్లుండి వర్షం కురియడంతో రోడ్డుపై వ్యాపారం చేసుకునే వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. దీనికి తోడు చలి విపరీతంగా ఉండటంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు కొంత మేర అవస్థ పడ్డారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

చిత్తూరు అర్బన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రమేష్‌బాబు కథనం మేరకు... ఇటీవల కాలంలో చిత్తూరురూరల్ మండలంలో పేకాటరాయుళ్లపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. గువ్వకల్లు వద్ద పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేసి లక్ష్మణకుమార్, భానుప్రకాష్, మురుగయ్య, కాశీం సాహెబ్, మానవకన్, రాజేంద్రన్‌లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,400 నగదును సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న టీడీపీ, సొసైటీ నేతలు

గంగాధరనెల్లూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యాదవ ఎంప్లాయిస్ సొసైటీకి చెందిన న్యూఇయర్ క్యాలెండర్‌ను టీడీపీ నేతలతో కలిసి ఆ సొసైటీ నేతలు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, టీడీపీనేతలు దేవపత్ని ధనంజయ నాయుడు, దేవసుందరం, మోహన్ నాయుడు, సొసైటీ నియోజకవర్గ అధ్యక్షుడు గురుప్రసాద్, మండల అధ్యక్షుడు దేవరాజులు యాదవ్,సుబ్రమణ్యం యాదవ్, హంస యాదవ్, భూషణ్‌యాదవ్, రాణియాదవ్, శేషాద్రియాదవ్, గాయత్రి యాదవ్ పాల్గొన్నారు.

గో బ్యాక్ అమిత్‌షా



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

చిత్తూరు రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఏపీకి రాకూడదని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక దర్గా సర్కిల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట గోబ్యాక్ అమిత్‌షా.. గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సాక్షాత్తు పార్లమెంట్‌లోనే అంబేడ్కర్‌ను అవమానపరిస్తే అమిత్‌షాపై చర్యలు కూడా తీసుకోకపోవడం బీజేపీ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. అలాంటి వ్యక్తి ఏపీకి ఎలా వస్తారని, దీనిని సీపీఐ తరఫున వ్యతిరేకిస్తున్నామని అన్నారు. సీపీఐ నాయకులు నాగరాజు, మణి, కవిత, ఆరుముగం తదితరులు పాల్గొన్నారు.

కోట్లాది రూపాయల స్థలం..

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

- వ్యర్థాలు, మద్యం బాటిళ్లతో మురికికూపంగా మారిన పాతబస్టాండ్



వ్యర్థాలు, తాగి పడేసిన మద్యం బాటిళ్లు, మూత్ర విసర్జనతో దుర్వాసన వెదజల్లుతున్న పాత బస్టాండ్

నగరం నడిబొడ్డున ఉన్న కోట్లాది రూపాయల పాత బస్టాండ్ స్థలం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ప్రజా ప్రతినిధుల ముందు చూపు... అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బస్టాండ్ ప్రాంతం మురికికూపంగా తయారైంది.

చిత్తూరు అర్బన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర నడిబొడ్డున ఉన్న కాసు బ్రహ్మానందరెడ్డి బస్టాండ్‌కు బస్సుల రాకపోకలు పెరగడంతో కొత్తగా ఆర్టీసీ బస్టాండు నిర్మించి అక్కడకు మార్చారు. ఆర్టీసీ బస్టాండు పక్కనే ప్రైవేటు బస్టాండ్‌ను కూడా ఏర్పాటు చేశారు. దాంతో పాత బస్టాండ్ స్థలం గత 15 ఏళ్లుగా ఖాళీగా ఉంది. గతంలో అనేక మంది ప్రజా ప్రతినిధులు పాత బస్టాండ్ స్థలంలో నగరానికే తలమానికంగా ఉండే విధంగా మల్టీస్టారర్ అపార్టుమెంట్ నిర్మిస్తామని హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ మాటే ఎత్తకుండానే వారివారి పదవీ కాలాన్ని ముగించేశారు. ఈ స్థలం ఖాళీగా ఉండటంతో షికారీలు కొంత స్థలాన్ని ఆక్రమించుకుని చిన్న చిన్న టెంట్‌లు వేసుకోగా... మరి కొంత మంది పండ్ల వ్యాపారులు అక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం జనంతో రద్దీగా ఉండటంతో పాటు కొన్ని ప్రైవేటు బస్సులు కూడా బస్టాండులోకి వస్తూ పోతున్నాయి. పండ్ల వ్యాపారులు వ్యర్థాలను అక్కడే పడేస్తున్నారు. మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడంతో అక్కడే మూత్ర విసర్జన చేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. రాత్రి వేళల్లో కొంత మంది అక్కడే మద్యం సేవించి బాటిళ్లను పడేస్తున్నారు. అటు తమిళనాడు, ఇటు కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులకు పాత బస్టాండ్ స్థలం అంద విహీనంగా దర్శనమిస్తోంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం పాత బస్టాండ్ స్థలంపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డు పెట్టినా దున్నేశారు..!



హెచ్చరిక బోర్డు ఉన్న చోట ఆక్రమణదారుడు దున్నిన దృశ్యం

వెదురుకుప్పం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆరు నెలల క్రితం హెచ్చరిక బోర్డును వెదురుకుప్పం తహసీల్దార్ పెట్టించారు. అయినా ఆ బోర్డు పెట్టిన భూమిలో ఆక్రమణదారుడు ప్రస్తుతం యథేచ్ఛగా దున్నకం పనులు చేపట్టారు. వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ మోడల్ కాలనీ సమీపంలో వేణుగోపాలపురం రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నంబరు 220లో 3.48 ఎకరాల ప్రభుత్వ భూమి(కాలువ పోరంబోకు) స్థలమని ఆరు నెలల క్రితం తహసీల్దార్ హెచ్చరిక బోర్డు పెట్టించారు. అయినప్పటికీ ఆక్రమణదారుడు ట్రాక్టరు సాయంతో దున్నకం చేశారు. హెచ్చరిక బోర్డు మేరకు ఆక్రమణకు పాల్పడిన వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు చేపట్టి, ట్రాక్టర్‌ను సీజ్ చేస్తారా? లేక మిన్నకుండిపోతారా అనేది చర్చనీయాంశంగా మారింది.

సారూ... పింఛను మంజూరు చేయండి..!



పింఛను కోసం ఎదురు చూస్తున్న తులసమ్మ

విజయపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సార్... నాకు పింఛను మంజూరు చేయండి అంటూ మండలంలోని కమ్మకండ్రిగకు చెందిన 63 సంవత్సరాల వృద్ధురాలు, వితంతువు తులసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. భర్త రాధాకృష్ణ పింఛను పొందుతూ గత సంవత్సరం మృతి చెందారని, అప్పటి నుంచి పింఛను కోసం ప్రతి ఆఫీసు మెట్లు ఎక్కినా ప్రయోజనం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. భర్త చనిపోవడంతో ఎలాంటి జీవనాధారం లేక పూరిగుడిసెలో ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నానని కంటతడి పెట్టారు. సంవత్సరం రోజులుగా తిరుగుతున్నా అధికారులు కనికరించడం లేదని వాపోయారు. పింఛను తీసుకుంటూ మృతి చెందితే.. వెంటనే వారి కుటుంబ సభ్యులకు పింఛను మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు సూచించినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు కరుణించాలని ఆమె ప్రాధేయపడుతున్నారు.

వర్షంతో మామిడి పంటకు దెబ్బ

పాలసముద్రం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలో ఆదివారం వేకువ జాము నుంచి మధ్యాహ్నం వరకు ఓ మోస్తరు వర్షం కురిసిం. ఈ వర్షం కారణంగా పంట భూముల్లో నీళ్లు నిలిచాయి. వాగులు ప్రవహిస్తున్నాయి. జనవరి నెలలో మామిడి తోటలు పూత దశలో ఉన్నాయి. ఈ సంవత్సరం వర్షాలు అధికంగా కురవడం వలన కొన్ని గ్రామాల్లోని మామిడి తోటల్లో ఇంత వరకు పూత రాలేదు. జనవరి నెలాఖరులో సైతం అకాలవర్షం కురవడంతో మామిడి తోటల్లో ఉన్న పూత మగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం అధికవర్షాల కారణంగామండలంలో మామిడి పంట దెబ్బతింది. వరుసగా రెండవ సంవత్సరంకూడా అకాల వర్షాలు మామిడి రైతులు నష్టపోయేటట్లు చేసిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

కులగణన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

చిత్తూరు సెంట్రల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కులగణన జరిగిన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చర్యలు చేపట్టాలని దళిత సంక్షేమ సేవా సంఘం ఏపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్సీలకు క్రిమిలేయర్‌ను అమలు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రస్తుతం జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ సంక్షేమానికి ప్రభుత్వం అందించే రాయితీలు కిందిస్థాయికి చేరడం లేదన్నారు. గత ప్రభుత్వం ఎస్సీలను అణగదొక్కిందని, అధికార కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శివాజీ, గోపాలయ్య, గోపీనాథ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలో జూనియర్ కళాశాల మైదానం



పచ్చికాపల్లం జూనియర్ కళాశాల

వెదురుకుప్పం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలో పచ్చికాపల్లం జడ్పీ కళాశాల(బాలికల) మైదానం మాయమైంది. ఆ కళాశాల లెక్కల ప్రకారం క్రీడా మైదానం 7.32 ఎకరాలు. కానీ, అక్కడ ఆ విస్తీరణం లేదు. పరిరక్షించాల్సిన యంత్రాంగం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోంది. ఆక్రమణలకు గురికావడంతో విద్యార్థులకు క్రీడా మైదానం లేకుండా పోయింది. ఈ మైదానం కళాశాలవారి లెక్కల ప్రకారం సర్వే నంబర్లు 222, 222/1, 222/2 తో 7.32 ఎకరాల స్థలంగా ఉంది. పచ్చికాపల్లం ప్రాంతంలో భూముల విలువ బాగా ఉండటంతో ఆక్రమణలకు గురైందని ఆ కళాశాలలో చదివే 400 మంది విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలో అన్ని రకాల మౌలిక వసతులు ఉన్నప్పటికీ.. క్రీడలకు అవసరమైన మైదానం లేకుండా పోయింది. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతు పనులు త్వరగా పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే జగన్మోహన్



బాలికకు సైకిల్ అందిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గుడిపాల మండల పరిధిలోని వేలూరు రోడ్డులోని చెన్నై క్రాస్ జంక్షన్ నుంచి ఆంధ్రా సరిహద్దు వరకు రోడ్డు మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఈ రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయమై ఉండేదని చెప్పారు. మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2.30 కోట్ల నిధులు విడుదల చేసిందని తెలిపారు. త్వరితగతిన పనులను పూర్తి చేయించాలని అధికారులను కోరారు. అనంతరం మండలంలోని విద్యార్థులకు ఆయన ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈ దస్తగిరి, పీఆర్ డీఈ నవీన్‌కుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో శివరాజ్, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ, ఎంపీటీసీ హరిప్రసాద్, నేతలు నాగరాజ యాదవ్, ఉదయ, పద్మ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



మొదటి బహుమతిని పొందిన ముగ్గు, ముగ్గు వేసిన జీవిత

చిత్తూరు రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లా డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో డెఫ్ మహిళలు డెఫ్ మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు వేసిన ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. మొదటి బహుమతిని జీవిత కైవసం చేసుకోగా, రెండవ బహుమతిని సుగుణమ్మ, మూడవ బహుమతిని డిల్లీరాణిలు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అమ్మఒడి ట్రస్ట్ నిర్వాహకుడు పద్మనాభ నాయుడు, లత, రాజశేఖర్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు